ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల
జిల్లా వార్తలు
5
బుధవారం 20 ఆగస్టు 2025

జోరు వాన

పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

- 657 హెక్టార్లలో పంట నష్టం
- స్తంభించిన జనజీవనం
- బ్రిడ్జిల వద్ద పోలీసుల పహారా
- హైలెవల్ వంతెన నిర్మించాలంటున్న కొత్తపల్లి ప్రజలు
- సిద్ధాపురం చెరువులో 21అడుగుల మేర నీటి నిల్వలు


ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా జోరుగా వానలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కుందూ, మద్దిలేరు. చామకాల్వ, పాలేరు నదులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బ్రిడ్జిల వద్ద పోలీసులతో పాటు గ్రామసేవకులు పహారా కాస్తున్నారు. మహానంది మండలంలో మంగళవారం 20.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో మొత్తం 657 హెక్టార్లలో పలు పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. కొత్తపల్లి మండలంలోని శివపురం-లింగాపురం గ్రామాల మధ్యలో ఉన్న ఎద్దులేరు వాగు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. సిద్ధాపురం చెరువు జలకళను సంతరించుకుంది.


కొత్తపల్లి శివపురం ఎద్దులేరు వాగుకు తగ్గని వరద ప్రవాహం

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఉపరితలద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. 11వ తేదీ నుంచి ఏకధాటిగా మంగళవారం వరకు 3760.2 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో జిల్లాలోని వాగులు, వంకలు, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కుందూ, మద్దిలేరు. చామకాల్వ, పాలేరు నదులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బ్రిడ్జిల వద్ద పోలీసులతో పాటు గ్రామసేవకులు పహారా కాస్తున్నారు. జిల్లాలో అధిక వర్షాల ప్రభావంతో మొక్కజొన్న, పత్తి, మినుము పంటలకు అధిక నష్టం వాటిల్లింది. నందికొట్కూరు మండలంలో 209 హెక్టార్లలో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లగా, రెండు హెక్టార్లలో పత్తి, మరో రెండు హెక్టార్లలో వరి పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. ఆత్మకూరు మండలంలో మొక్కజొన్న 210 హెక్టార్లు, పత్తి ఒక హెక్టారులో దెబ్బతిన్నట్లు వెల్లడించారు. కోవెలకుంట్ల మండలంలో 24 హెక్టార్లలో మినుములు, 35 హెక్టార్లలో మొక్కజొన్న, 13 హెక్టార్‌లలో పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 657 హెక్టార్‌లలో పలు పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. అత్యధికంగా కంకి దశలో ఉన్న మొక్కజొన్న పంటకు భారీ నష్టం వాటిల్లింది. ముందస్తుగా కురిసిన వర్షాలతో జూన్, జూలై నెలల్లో రైతులు పెద్ద ఎత్తున మొక్కజొన్న పంటను సాగుచేశారు.

ఎద్దులేరు వాగుకు తగ్గని వరద

కొత్తపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివపురం-లింగాపురం గ్రామాల మధ్యలో ఉన్న ఎద్దులేరు వాగుకు వరద ప్రవాహం తగ్గలేదు. మంగళవారం కూడా ఎద్దులేరు వాగు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్తపల్లి శివారులోని కనికలమ్మ చెరువుకు భారీగా వరద వచ్చి చేరుతోంది. మూడు రోజులుగా ప్రజలకు రాకపోకలు నిలిచిపోవడంతో 20 గ్రామాలకు జనజీవనం స్తంభించిపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హైలెవెల్ వంతెన ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


ఎద్దులేరు వాగు వద్ద పోలీసు బందోబస్తు


నంద్యాల మండలంలోని మద్దిలేరు వాగు


నంద్యాలలోని చామకాల్వలో వరద ప్రవాహం

సిద్ధాపురం చెరువుకు జలకళ


జలకళతో తొణికిసలాడుతున్న సిద్ధాపురం చెరువు

ఆత్మకూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే అతిపెద్ద చెరువుగా పేరుగాంచిన సిద్ధాపురం చెరువు జలకళను సంతరించుకుంది. మంగళవారం ఉదయానికి గరిష్ఠ స్థాయిలో నీటిమట్టం నమోదైంది. ఈఏడాది జూలై 28వ తేదీన ఎత్తిపోతల పథకం ద్వారా వెలుగోడు జలాశయం నుంచి సిద్ధాపురం చెరువులోకి నీటి విడుదల చేపడుతున్నారు. కొన్నిరోజులుగా వర్షాలు కురియడంతో ఎత్తిపోతల పథకం ద్వారా నీటి విడుదలను నిలిపివేశారు. మూడు రోజులుగా నల్లమలలో భారీ వర్షాలు కురియడంతో నీరంతా రాళ్లవాగు ద్వారా సిద్ధాపురం చెరువులోకి చేరింది. దీంతో చెరువు గరిష్ఠ నీటిమట్టం 21 అడుగుల మేరకు నీటినిల్వలు వచ్చి చేరాయి. అటవీ ప్రాంతం నుంచి సుమారు 600 క్యూసెక్కుల మేర చెరువులోకి నీరు చేరుతోంది. దీన్ని అలుగు ద్వారా గాలేరు వాగుకు మళ్లిస్తున్నారు. ఈ నీరంతా గాలేరు వాగు మీదుగా వెలుగోడు జలాశయంలోకి వెళ్తోంది. సిద్ధాపురం చెరువులో గరిష్ఠంగా నీరు ఉండటంతో ఇన్‌ఫ్లో అధికమైతే పక్కనే ఉన్న కర్నూలు-గుంటూరు రహదారిపైకి నీరు చేరే అవకాశం ఉండటంతో అక్కడ కూడా రక్షణ చర్యలు చేపట్టారు.

మిగతా 6వ పేజీలో

స్వర్ణ రథంపై ఆది దంపతులు


రథోత్సవం ఎదుట కోలాటాల ప్రదర్శన


రథోత్సవంలో పాల్గొన్న ఆలయ ఈవో శ్రీనివాసరావు, అర్చకులు, అధికారులు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మల్లికార్జునస్వామి జన్మనక్షత్రమైన ఆరుద్రను పురస్కరించుకుని శ్రీశైలంలో మంగళవారం స్వర్ణ రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం నుంచి అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు స్వామి అమ్మవార్లకు నిర్వహించారు. ఆరుద్రోత్సవంలో భాగంగా స్వర్ణరథోత్సవంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ గంగాధర మండపం చుట్టూ స్వర్ణరథం కదిలింది. రథం ఎదుట కళా బృందాల కోలాటం, డోలు వాయిద్యం, జానపద కళారూపాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరదరాజ స్వామి ప్రాజెక్ట్..!

నిండుకుండలా జలాశయం

ఆత్మకూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో నల్లమల అడవుల్లోని మునిమడుగుల వాగుపై నిర్మించిన వరదరాజ స్వామి ప్రాజెక్ట్ నిండుకుండలా కనిపిస్తోంది. నల్లమలలో కురుసిన భారీ వర్షాలతో ప్రాజెక్ట్‌లో గరిష్ఠ స్థాయిలో నీటిమట్టం నమోదైంది. దీంతో కొన్నిరోజులుగా ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల చేస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 370మీటర్లు గానూ 369.5మీటర్ల నీటినిల్వలకు చేరుకున్నాయి. అదేవిధంగా ప్రాజెక్ట్ గరిష్ఠ నీటి సామర్థ్యం 389.1 ఎంసీఎఫ్‌టీలకు గానూ 374.6 ఎంసీఎఫ్‌టీలకు చేరుకుంది. దీంతో ప్రాజెక్ట్ క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షపు నీటిని దిగువ మునిమడుగుల వాగుకు విడుదల చేస్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.


నిండుకుండలా కనిపిస్తున్న వరదరాజ స్వామి ప్రాజెక్ట్

మాన్యం భూములను కాపాడుకోవాలి
- ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్ 6

మశకం..
మహా ప్రమాదం..!



ఆత్మకూరులో నన్నారీ తయారీ కేంద్రం

- శ్రీశైలంలో రూ.కోటితో గిరిజన ఉత్పత్తుల కేంద్రం
- జీవనప్రమాణాల పెంపునకు కృషి
- స్త్రీశిశు , గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి



మాట్లాడుతున్న రాష్ట్ర స్త్రీశిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ఆత్మకూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గిరిజనులు అత్యధికంగా నివసించే ఆత్మకూరు ప్రాంతంలో నన్నారీ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర స్త్రీశిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి వెల్లడించారు. మంగళవారం శ్రీశైల దేవస్థానం పరిధిలోని సమావేశ భవనంలో స్త్రీశిశు సంక్షేమం, గిరిజన శాఖలకు సంబంధించి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు గిరిజన సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. గిరిజనుల జీవనప్రమాణాలను మెరుగుపరిచేందుకు రాష్ట్రంలోని 7 ఐటీడీఏల్లో రూ.కోటి చొప్పున గిరిజన ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే శ్రీశైలంలో కూడా రూ.కోటి నిధులతో గిరిజన ఉత్పత్తుల కొనుగోలు కేంద్రానికి శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. ఇక్కడ అన్ని గిరిజన ఉత్పత్తులు విక్రయించుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు చెప్పారు.

మిగతా 6వ పేజీలో

వీబీఆర్‌కు జలకళ


జలాశయం నుంచి వరద ప్రవాహం

తెలుగుగంగలో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు జలకళ సంతరించుకుంది. జలాశయంలోకి బనకచెర్ల సముదాయం నుంచి 13,300 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. జలాశయం నుంచి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం జలాశయంలో 263.44 మీటర్ల వద్ద 14.836 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

- వెలుగోడు (ఆంధ్రజ్యోతి)

కార్యాలయమా.. లాడ్జినా..?

- కుక్కల వేటగాళ్లకు నివాసంగా మారిన మున్సిపల్ కార్యాలయం
- కౌన్సిలర్ల మధ్య వర్గ విభేదాలు
- ఇరుకు గదుల్లో ఉద్యోగుల విధులు
- ఇబ్బందుల్లో టీపీ విభాగం అధికారులు


ఖాళీగా ఉన్న టౌన్ ప్లానింగ్ కార్యాలయంలో వంట చేసుకుంటున్న కుక్కలు పట్టేందుకు వచ్చిన కార్మికులు

మున్సిపల్ కార్యాలయంలో అత్యంత కీలకమైనది టౌన్ ప్లానింగ్(టీపీ) విభాగం. కానీ ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు పడుతున్న బాధలు మాత్రం వర్ణనాతీతం. కౌన్సిలర్ల మధ్య కొనసాగుతున్న వర్గ పోరులో వీరు నలిగిపోతున్నారు. ఓ వర్గానికి చెందిన వారు ఉండాలనుకొని టౌన్ ప్లానింగ్ కార్యాలయాన్ని ఖాళీ చేయించి మరమ్మతులు చేయించారు. తీరా కౌన్సిలర్లు చేరేందుకు సిద్ధం అవుతుండగా మరో వర్గం కౌన్సిలర్లు అడ్డు చెప్పారు. ఆ గది ఖాళీగా ఉండిపోయింది. అక్కడి నుంచి మేనేజర్ వింగ్‌లోకి వెళ్లిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఇరుకు గదిలో విధులు నిర్వహిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం మరమ్మతులు చేయించిన గది ఖాళీగా ఉండటంతో కుక్కలు పట్టే వేటగాళ్లకు కేటాయిం చారు. వారు ఆ గదిని లాడ్జిగా మార్చుకొని వంట వార్పు, అన్నీ అక్కడ కానిస్తుండటంతో దీన్ని చూసిన పలువురు అవాక్కయ్యారు.

నందికొట్కూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉన్న సెక్షన్లను పలువురు వివిధ రకాలుగా వాడుకుంటున్నారు. కార్యాలయం ఉన్నా కూడా ఇరుగు గదుల్లో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. కౌన్సిలర్ల నడుమ వర్గ విభేదాలతో టౌన్ ప్లానింగ్ కార్యాలయాన్ని ఖాళీ చేయించి వారు ఉండాలనుకున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి మరమ్మతులు చేయించారు. నేడు ఆ కార్యాలయం కుక్కల వేటగాళ్లకు నివాసంగా మారింది. బయట ఎక్కడో ఒకచోట నివాసం కల్పించాల్సింది పోయి టౌన్ ప్లానింగ్ కార్యాలయం ఖాళీగా ఉందని వారికి కేటాయించారు. ఈ కార్యాలయం మున్సిపల్ చైర్మన్ చాంబర్‌కు ఎదురుగా ఉండడం గమనార్హం.

రెండు వర్గాల మధ్య...

ఎంపీ డా.బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య వర్గాలకు చెందిన కౌన్సిలర్లు తమకు ప్రత్యేక గది కావాలని ఎవరికి వారుగా అధికారులను గతంలో ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ అధికారులను ఖాళీ చేయించి మరీ లక్షల్లో ఖర్చుచేసి మరమ్మతులు చేయించారు. తీరా కౌన్సిలర్లు చేరేందుకు సిద్ధం అవుతుండగా మరో వర్గం కౌన్సిలర్లు అడ్డు చెప్పడంతో ఆ గది ఖాళీగా ఉండిపోయింది. అక్కడి నుంచి మేనేజర్ వింగ్‌లోకి వెళ్లిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఇరుకు గదిలో విధులు నిర్వహిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. టౌన్ ప్లానింగ్‌లో 14వార్డు సచివాలయాల్లో 9మంది వార్డు ప్లానింగ్ రెగ్యులైజేషన్ సెక్రటరీ (డబ్ల్యూపీఆర్ఎస్), ఆఫీసులో ఆరుగురు అధికారులతో (టీపీవో, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, మరో ముగ్గురు) మొత్తం 15మంది టౌన్ ప్లానింగ్‌లో ఉన్నారు. ఆయా వార్డుల్లోని టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన విషయాలను చర్చించేందుకు డబ్ల్యూపీఆర్ఎస్ అధికారులు, పట్టణ ప్రజలు తరచూ టౌన్ ప్లానింగ్‌కు వస్తుంటారు. ఇరుకు గదిలో ఉండడంతో అధికారులతో మాట్లాడడానికి ఇబ్బందులకు గురవుతున్నారు.

అన్ని విభాగాలకు ఈ గది నుంచే..


మొదట ప్రస్తుతం మేనేజర్ ఉన్న గదిలోకి మార్చారు. ఆ తర్వాత నూతన మేనేజర్ రావడంతో అక్కడి నుంచి ఖాళీ చేసి ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న గదిలోకి వచ్చారు. కుక్కలు పట్టేందుకు వచ్చిన కార్మికులను ఏకంగా కార్యాలయాన్నే వారికి అధికారులు కేటాయించారు. మున్సిపల్ కార్యాలయంలోని అన్నివిభాగాలకు అకౌంట్ సెక్షన్, ఆర్వో, మేనేజర్ గదికి వెళ్లేందుకు ఈగది నుంచే వెళ్లాల్సి ఉంది. గదికి నాలుగు వింగ్‌లకు వెళ్లే అధికారులు, ప్రధాన ద్వారం కలిపి మొత్తం ఐదు ద్వారాలు ఉన్నాయి. వీటి ద్వారా ఆయా సెక్షన్‌లకు వెళ్లే ప్రజలు, అధికారులు తరచూ ఈ గది నుంచే వెళ్తుంటారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో అధిక మంది సిబ్బంది ఉండడంతో తరచూ ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఖాళీగా ఉన్న టౌన్ ప్లానింగ్ కార్యాలయంలో కార్మికులు వంట చేస్తూ కనిపించారు. ఇది చూసిన పలువురు టౌన్ ప్లానింగ్ అధికారుల కంటే కుక్కలు పట్టేందుకు వచ్చిన కార్మికులకే అధికారులు, నాయకులు ప్రాధాన్యం ఇస్తున్నారని చెవులు కొరుక్కుంటున్నారు.


ఇరుకుగదిలో విధులు నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

వారు వెళ్లిపోయారు

కుక్కలు పట్టేందుకు వచ్చిన కార్మికులు ఒక్క రోజు మాత్రమే ఇక్కడ ఉన్నారు. ఢిల్లీలోని పశుసంవర్ధకశాఖ నుంచి ఫోన్ రావడంతో వారిని వెనక్కి పంపించాం.

- బేబి, మున్సిపల్ కమిషనర్, నందికొట్కూరు



నందికొట్కూరు మున్సిపల్ కార్యాలయం



మశకం మహా ప్రమాదం..!

చిన్న దోమే కదా.. అని అశ్రద్ధ చేస్తే ప్రాణాలు హరిస్తుంది. వర్షాలు కురవగానే దోమలు ముసురుకుంటాయి. ఇంటా బయట తేడా లేకుండా స్వైర విహారం చేస్తాయి. వర్షాకాలంలో దోమల బెడద విపరీతంగా ఉంటుంది. ఇదే సమయంలో దోమల ద్వారా డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధులు వ్యాపిస్తుంటాయి. పైగా వర్షాలు కురుస్తున్న వేళ దోమల తీవ్రత అధికంగానే ఉంటుంది. ఇలాంటి సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల నివారణకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రపంచ దోమల నివారణ దినం నిర్వహిస్తున్నారు. దోమల కారణంగా మలేరియా వ్యాధి వ్యాపిస్తుందని 1897 ఆగస్టు 20లో బ్రిటీష్ వైద్యాధికారి సర్ రోనాల్డ్ రాస్ కనుగొన్నాడు. ఆ రోజును గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం ఆగస్టు 20న ప్రపంచ దోమల నివారణ దినం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మరింత సమానమైన ప్రపంచం కోసం మలేరియాకు వ్యతిరేకంగా పోరాటాన్ని వేగవంతం చేయాలన్న నినాదాన్ని ఇచ్చింది.

- కర్నూలు హాస్పిటల్ (ఆంధ్రజ్యోతి)

- వర్షాకాలంలో దోమల బెడద అధికం
- చిన్నకాటుతో ప్రాణాంతక వ్యాధులు
- నీటి నిల్వలే వాటి ఆవాసాలు
- నేడు ప్రపంచ దోమల నివారణ దినం

ఉమ్మడి జిల్లాలో మలేరియా, డెంగీ, చికున్ గున్యా కేసులు పెరుగుతున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎక్కడా మలేరియా, డెంగీ మరణాలు కనిపించవు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు డెంగీ కేసులు 268 నమోదయ్యాయి. వీటిలో కర్నూలు జిల్లాలో 182 కేసులు, నంద్యాల జిల్లాలో 86 కేసులు వెలుగు చూశాయి. ఇక మలేరియా కేసులు నంద్యాల జిల్లాలో 12 కాగా కర్నూలు జిల్లాలో 8 కేసులు వచ్చాయి. చికున్ గున్యా కర్నూలు జిల్లాలో 11 కేసులు రాగా, నంద్యాల జిల్లాలో ఒక్క కేసు నమోదైంది. డెంగీ కేసులు సి.బెళగల్ మండలంలో అత్యధికంగా 25 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఆ తర్వాత క్రిష్ణగిరి పీహెచ్‌సీలో 13 కేసులు, హాలహర్వి 8, ఉలిందకొండ పీహెచ్‌సీలో 8, లద్దగిరి పీహెచ్‌సీలో 8, మలేరియా కేసుల్లో కర్నూలు అర్బన్‌లో రెండు కేసులు వచ్చాయి.



డెంగీ:
ఆడ ఏడిస్ రకం దోమకాటు వల్ల డెంగీ వ్యాప్తి చెందుతుంది. ఈ దోమలు ఇళ్లలోని నీటి నిల్వలో మాత్రమే పెరుగుతాయి. పగటి పూట మాత్రమే కుడుతాయి. ఒక్కసారి వచ్చిన జ్వరం 7నుంచి 10 రోజులకు మళ్లీ వస్తుంది. వర్షాలు మొదలయ్యే సమయంలో దీని ప్రభావం కాస్త ఎక్కువగా ఉంటుంది.

మలేరియా
చలి వణుకుతో కూడిన తీవ్రమైన జ్వరం, తలనొప్పి, వికారం వాంతులు ఈ వ్యాధి వర్షాకాలంలో ప్లాస్మోడియం పరాన్న జీవుల వల్ల వస్తుంది. దోమకాటు తర్వాత 10 నుంచి 15 రోజుల తర్వాత కనిపిస్తుంది. పిల్లలు, గర్భవతులకు ఈ వ్యాధి ప్రమాదకరమైంది.

చికున్‌గున్యా
ఆకస్మాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు, వ్యాధి వచ్చినప్పుడు జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు కూడా వచ్చి ప్రత్యేకించి కీళ్లు చిన్న కీళ్ల దగ్గర ఎక్కువగా బాధిస్తాయి. ఈ వ్యాధి ఆడ ఏడిస్ దోమకాటుతో వస్తుంది. ఈ వ్యాధి గ్రామంలో ఎక్కువ మందికి ఒకేసారి వచ్చే అవకాశం ఉంది.



దోమల నివారణకు చర్యలు

గ్రామాల్లో, పట్టణాల్లో నీటి నిల్వలు ఉండే ప్రదేశాల్లో నీరు లేకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు మురుగు కాలువల్లో నీరు బ్లాక్ అయిన పక్షంలో వెంటనే శుభ్రం చేయించాలి. పారిశుధ్యం, నీటి ట్యాంకుల క్లీనింగ్, క్లోరినేషన్ ప్రక్రియను చేపట్టాలి. 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు, గర్భవతులకు ఎవరికైనా జ్వరం వస్తే దగ్గరలో ఉండే పీహెచ్‌సీలకు వెళ్లాలి. 2030 నాటికి భారతదేశాన్ని మలేరియా రహిత దేశంగా చేయాలన్న లక్ష్యాన్ని ప్రజలు సహకరించాలి. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధులకు వైద్యుల సలహాల మేరకు చికిత్స పొందాలి.

● డాక్టర్ పి.శాంతికళ, డీఎంహెచ్‌వో, కర్నూలు

3,500 రకాల దోమలు


ప్రపంచ వ్యాప్తంగా 3,500 రకాల దోమలు ఉన్నాయి. అందులో 400 రకాలు మన దేశంలో ఉన్నాయి. అయితే.. ఈ దోమలన్నీ మనల్ని కుట్టేవి రోగాల్ని తెచ్చేవి కావు. దోమ జీవితకాలం 28 నుంచి 30 రోజులు జీవిస్తుంది. ప్రతి మూడు రోజులకు ఒకసారి 100 నుంచి 150 గుడ్లు పెడుతుంది. దోమ గుడ్డు పెట్టిన 7 నుంచి 8 రోజుల్లో దోమగా మారుతుంది. దోమ జీవిత చరిత్రలో గుడ్లు, లార్వా, ప్యూపా, ప్రౌఢ దశలు ఉంటాయి. మన ఇంట్లో వాడే నీళ్లలో లార్వాలను మనం పురుగులు అంటాం. అది సరికాదు.. లార్వా దశ నుంచి 4 రోజుల తర్వాత అవి దోమలుగా మారుతాయి. ఎప్పుడయితే లార్వాలను మన ఇంట్లో చూసినప్పుడు ఆ నీటిని మట్టినేలపైగానీ, సిమెంటు రోడ్డు మీద పారవేయాలి. అలా అయితే దోమ చనిపోతుంది.



వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటం, పారిశుధ్యం లోపించడం వంటి కారణాలతో వర్షాకాలంలో దోమల వల్ల పలు వ్యాధులు వ్యాప్తి చెందుతుంటాయి. ముఖ్యంగా వర్షాకాలంలో దోమల వల్ల వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. చలితో కూడిన జ్వరం మూడు రోజులు ఉంటే మలేరియాగా భావించాలి. నీటి నిల్వలను వారానికి ఒకసారి ఖాళీ చేసి ఆరబెట్టి నీళ్లు పట్టుకోవాలి.

● డాక్టర్ సి.లక్ష్మి ప్రసాద్, సీనియర్ ఫిజిషియన్, కర్నూలు



పరిశుభ్రత ముఖ్యం



దోమలు పుట్టకూడదు.. కుట్టకూడదు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ఉదయం, సాయంత్రం వేళలో సూర్యోదయం, సూర్యాస్తమయం సమయాల్లో ఇంటి తలుపులు, కిటికీలు వేసుకోవాలి. దోమతెరలు తప్పక వాడాలి. ఇంటి కిటికీలకు తలుపులకు జాలీలు బిగించుకోవాలి. మున్సిపల్, పంచాయతీ సిబ్బంది ప్రతి వారం యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించి మురుగు కాలువల్లో బ్లాకులు లేకుండా చేయాలి. వాటర్ ట్యాంకులు, ఇంటిలో నీటి నిల్వలు మీద దోమలు చొరబడని మూతలు వేయాలి.

● ఏ.నూకరాజు, జిల్లా మలేరియా అధికారి, కర్నూలు

ఆత్మకూరులో నన్నారీ తయారీ కేంద్రం

5వ పేజీ తరువాయి

తద్వారా గిరిజనులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. నల్లమలలోని చెంచు గిరిజనులందరికి ఆధార్, రేషన్ కార్డులను మంజూరు చేసి సంక్షేమ పథకాలను అందిస్తామని తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా గిరిజన గూడేలకు అటవీ శాఖతో అభ్యంతరాలు తలెత్తకుండా రహదారులను ఏర్పాటు చేస్తామని అన్నారు. కాగా శ్రీశైలంలో గిరిజనులకు ప్రస్తుతం కేటాయించిన దుకాణాల కంటే అదనంగా దుకాణాలను కేటాయించేలా దేవస్థానం అధికారులు శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. అదేక్రమంలో గిరిజనులకు తక్కువ ధరలకే దుకాణాలను కేటాయించాలని ఆదేశించారు. ఇదిలావుంటే ఉచిత బస్సు పథకం మహిళలకు చంద్రన్న ఇచ్చిన వరం లాంటిదని అన్నారు. అయితే ఈ పథకం పట్ల కొందరు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఆత్మలతో మాట్లాడే.. పిచ్చోళ్ల గురించి తాను మాట్లాడనని పరోక్షంగా మాజీ సీఎం జగన్‌ను విమర్శించారు. అనంతరం శ్రీశైలం ఐటీడీఏ ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సమావేశంలో ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ సదాభార్గవి, కలెక్టర్ రాజకుమారి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, ఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పనితీరుపై సమీక్ష

నంద్యాల జిల్లా పరిధిలోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు సంబంధించి మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని ఆరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,663 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో 1,620 ప్రధాన, 43 మినీ అంగన్‌వాడీలు ఉన్నట్లు తెలిపారు. 2 వర్కర్లు, 2 మినీ వర్కర్లు, 40 హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించి వాటిని భర్తీ చేయాలన్నారు. బాల సంజీవని పోషణ పథకాలు విజయవంతంగా అమలు అవుతున్నాయన్నారు. గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులకు ఉచితంగా గుడ్లు, పాలు, మల్టీగ్రేన్, పిండి తదితర పోషకాహారం అందిస్తున్నట్లు చెప్పారు. పథకాల ద్వారా లక్ష మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలుగుతోందన్నారు. 2024లో ఏర్పడిన శిశు సంరక్షణ యూనిట్ ద్వారా 157 మంది పిల్లలను రక్షించినట్లు తెలిపారు. బాల్యవివాహాలు, పీఓసీఎస్‌ఓ బాల కార్మిక కేసుల్లో చర్యలు తీసుకున్నామన్నారు. వైద్య, కౌన్సెలింగ్ సేవలను అందిస్తున్నట్లు వివరించారు. మహిళలు, పిల్లల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

మట్టిలో మాణిక్యం

- హోటల్‌లో పనిచేస్తూనే పీహెచ్‌డీ
- తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం
- ఓయూ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్న క్రాంతికుమార్



డాక్టరేట్‌ను చూపుతున్న క్రాంతికుమార్

ఆదోని, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తున్న తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటూ అక్కడే పనిచేస్తూ పీహెచ్‌డీ పూర్తిచేశాడు. ఆదోని పట్టణంలోని ఎన్‌డీబీఎల్ కాలనీకి చెందిన ఆంజనేయ, మల్లమ్మ దంపతుల కుమారుడు క్రాంతికుమార్. తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందాన్ని నింపాడు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ) స్నాతకోత్సవ వేడుకల్లో ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణ చేతులమీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఆయన డిగ్రీ ఆదోని ఆర్ట్స్ కళాశాలలో పూర్తి చేసి, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చదివారు. ఆయన కెమిస్ట్రీ 'డిజైన్ అండ్ ఫ్యాబ్రికేషన్ ఆఫ్ మెటల్ ఆక్సైడ్ అండ్ సల్ఫైడ్ అంశంపై పరిశోధన చేసి ప్రొఫెసర్ డాక్టర్ విజయ్‌కుమార్‌కు పత్రాన్ని సమర్పించారు. దీంతో క్రాంతి కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రస్తుతం ఆయన ఎమ్మిగనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నారు.

29 నుంచి తెలుగు భాషా దినోత్సవాలు

- విద్యార్థులు, యువత, కళాకారులకు పోటీలు
- టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహణ

కర్నూలు కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 29 నుంచి 31వ తేదీ వరకు మూడు రోజుల పాటు తెలుగు భాషా దినోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు టీజీవీ కళాక్షేత్రం సంకల్పించింది. తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా మూడు రోజుల పాటు వేడుకలు, విద్యార్థులు, యువత, కళాకారులకు పోటీలు నిర్వహించనుంది. ఈ మేరకు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య మంగళవారం వివరాలను వెల్లడించారు. 29న ఉదయం 10 గంటలకు 'విద్యా బోధనలో తెలుగు భాష' అనే అంశంపై హైస్కూల్, కళాశాలల విద్యార్థులకు పోటీలు ఉంటాయని తెలిపారు. హైస్కూలు విద్యార్థులను జూనియర్స్‌గా, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులను సీనియర్స్‌గా పరిగణిస్తామని తెలిపారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.5వేలు, రూ.3వేలు, రూ.2 వేలు నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు. వీటితో పాటు మరో ఐదుగురు విద్యార్థులకు ఆయా విభాగాల్లో కన్సొలేషన్ బహుమతులు ఉంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈనెల 25లోగా సంబంధిత పాఠశాల, కళాశాలల యాజమాన్యం నుంచి తమ పేర్లను వాట్సాప్ ద్వారా పంపవచ్చన్నారు. ఒక్కో విద్యాసంస్థ నుంచి నలుగురు విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. పేర్ల నమోదుకు 99892 65632 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. లేదా సీ.క్యాంప్ రైతు బజార్ వద్ద ఉన్న టీజీవీ కళాక్షేత్రంలో కూడా అందజేయవచ్చని తెలిపారు.



30న ఏకపాత్రాభినయ పోటీలు

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఈనెల 30న ఉదయం 10 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో ఏకపాత్రాభినయ పోటీలు కర్నూలు, నంద్యాల జిల్లా రంగస్థల కళాకారులకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పౌరాణిక, చారిత్రక నాటక అంశాలపై ఈ పోటీ ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనే కళాకారులు తాము ప్రదర్శించే పాత్రల వివరాలు జీవీ శ్రీనివాసరెడ్డి, సెల్ నెం.92912 06030 లేదా గాండ్ల లక్ష్మన్న సెల్ నెం. 90003 85480కు వాట్సాప్ చేయవచ్చని తెలిపారు. ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2వేలతో పాటు ఐదు కన్సొలేషన్ బహుమతులు ఉంటాయని తెలిపారు. ప్రదర్శన 15 నిముషాలు మాత్రమే ఉండాలని, ఈనెల 31న సాయంత్రం ముగింపు వేడుకల్లో అతిథులతో బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు. అనంతరం 'ఎవరు' సాంఘిక నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు.

జోరు వాన

5వ పేజీ తరువాయి



సుంకేసుల బ్యారేజీ నుంచి 1,26,412 క్యూసెక్కులు విడుదల చేయడంతో తుంగభద్ర అంచుల్లో వరద ప్రవహిస్తుంది. మునగాలపాడు నుంచి జోహరాపురం వరకు దాదాపు ఐదు కిలో మీటర్లు నగరం అంచుల్లో తుంగభద్ర ప్రవహిస్తుంది. పంచలింగాల సమీపంలో హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారి-44 వంతెన, రోజా దర్గా సమీపంలో 120 ఏళ్ల నాడు అంటే 1905లో తుంగభద్రపై నిర్మించిన రైల్వే వంతెన (బిడ్జి) దాటుతూ, నగర అంచులను ముద్దాడుతూ పరుగులు పెడుతున్న తుంగభద్రమ్మ జల అందాలు ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తున్నాయి. నేషనల్ హైవే, సంకల్‌బాగ్ ప్రాంతాల్లో ప్రకృతి ప్రేమికులు నది ప్రవాహ అందాలను వీక్షిస్తూ పులకరించిపోయారు.

శ్రీశైలానికి పోటెత్తిన వరద

తెలుగు రాష్ట్రాల జీవనాడి శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తింది. సుంకేసుల బ్యారేజీ (తుంగభద్ర నది) నుంచి 1,36,587 క్యూసెక్కులు, జూరాల (కృష్ణా నది) నుంచి 2,36,437 క్యూసెక్కులు కలిపి 3,73,024 క్యూసెక్కులు వరద వచ్చి చేరుతుంది. డ్యాం గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 215.8 టీఎంసీలు కాగా, 887.70 అడుగుల వద్ద 197.46 టీఎంసీలు నిల్వ చేసి, 10 క్రస్ట్‌గేట్లు 12 మీటర్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా 3,04,690 క్యూసెక్కులు, తెలంగాణ, ఏపీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ద్వారా 65,468 క్యూసెక్కులు కలిపి 3,70,158 క్యూసెక్కులు దిగువన నాగార్జున సాగర్‌కు వదిలేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 30వేలు సీమ కాలువలకు విడుదల చేయగా, హంద్రీనీవా కాలువకు మాల్యాల లిఫ్ట్ ద్వారా 2,818 క్యూసెక్కులు ఎత్తిపోస్తున్నారు.

ఆర్డీఎస్ ఆనకట్టపై ఉధృతంగా వరద

కోసిగి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగసనూరు సమీపంలో ఉన్న ఆర్డీఎస్ ఆనకట్ట మీద ఐదు అడుగుల మేర వరద ప్రవహిస్తోంది. కడిడొడ్డి గ్రామంలో సుమారు 80ఎకరాల మేర వరి పైరు నీట మునిగింది. ఇప్పుడిప్పుడే వరినాట్లు వేసుకున్నామని, వరద రావడంతో పంటలు నీట మునిగాయని రైతులు గోతు లదొడ్డి ఎల్లయ్య, భోంపల్లి నగేష్, విజయకుమార్, మబ్బం అమేష్, కల్లూరు హనుమప్ప ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అగసనూరు, సాతనూరు, కడిడొడ్డి, కందుకూరు, తుమ్మిగనూరు గ్రామాల్లో నదీతీర ప్రాంతాల్లో పంటలు, మోటార్లు నీట మునిగాయి.

అధిక వర్షం.. తప్పని అవస్థలు

జిల్లాలో ఆగస్టు సాధారణ వర్షపాతం 71.2 మిల్లీ మీటర్లు కాగా, 182.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే 156 శాతం ఎక్కువ వర్షం పడింది. మూడు రోజుల వర్షం రికార్డులు పరిశీలిస్తే 17న 287.4 (జిల్లా సగటు 11.1 మి.మీలు), 18న 490.4 (జిల్లా సగటు 18.9 మి.మీలు), మంగళవారం 184 మిల్లీ మీటర్లు (జిల్లా సగటు7.1) వర్షపాతం నమోదు అయ్యింది.



ప్రకృతిమాత ప్రకోపం



ప్రకృతిమాత కన్నెర్ర చేస్తే ఎలా ఉంటుందో కళ్లకు కట్టినట్లు చూపించాడు చిత్రకారుడు చింతలపల్లె కోటేష్. తుఫాన్ ప్రభావంతో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ప్రజలు, రైతులకు కంటికి కునుకు లేకుండా పోతోంది. వాగులు, వంకలు, నదులు, చెరువులు నిండిపోయాయి. పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో పంటలు నాశనమవుతున్నాయి. జలప్రళయంతో ప్రజలు పడుతున్న కష్టాలు, రైతుల వేదన, వర్షపునీటితో పంటలు దెబ్బతిన్న దృశ్యాలు, ప్రజలు, రైతులు ప్రకృతి మాత ముందు మోకరిల్లి త్రికరణ శుద్ధితో ప్రకృతి మాత శాంతించు తల్లీ అని వేడుకున్నట్లు చిత్రం వేసి చిత్రకారుడు శభాష్ అనిపించుకున్నారు.



చిత్రాన్ని గీస్తున్న చిత్రకారుడు కోటేష్

● నంద్యాల కల్చరల్, ఆంధ్రజ్యోతి

మాన్యం భూములను కాపాడుకోవాలి : ఆర్జేసీ



మాట్లాడుతున్న చంద్రశేఖర్ ఆజాద్

మహానంది, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆలయాలకు చెందిన మాన్యం భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత ఆయా అధికారులదేనని దేవదాయ శాఖ రాయలసీమ మల్టీజోన్-2 రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. మంగళవారం మహానంది క్షేత్ర పరిధిలోని టీటీడీ కల్యాణ మండపంలో రాయలసీమ మల్టీజోన్-2 పరిధిలోని ఆలయాల ఈవోలతో మాన్యం భూముల పరిరక్షణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలకు చెందిన మాన్యం భూములు అన్యాక్రాంతం కాకుండా సిబ్బంది పరిరక్షించాలన్నారు. పురాతన ఆలయాలను కాపాడుకోవడంతో పాటు విలువైన భూములను కూడా రక్షించాలని ఆదేశించారు. కొన్ని ఆలయాలకు చెందిన సిబ్బంది సమావేశానికి పూర్తి సమాచారంతో రాక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే సమావేశానికి అయినా పూర్తి స్థాయి సమాచారంతో పాటు నివేదికలతో రావాలని ఆదేశించారు. అనంతరం ఆయా ఆలయాల పరిస్థితులపై ఈవోలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, ఉమ్మడి జిల్లాల అధికారులు సుధాకర్‌రెడ్డి, మోహన్, మహానంది దేవస్థానం ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఈవోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో పలు విభాగాల తనిఖీ

మహానంది క్షేత్రంలో భక్తులకు అన్ని వసతులు సమకూర్చి మరింతగా తీర్చిదిద్దాలని రాయలసీమ జోన్ మల్టీజోన్-2 దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. మంగళవారం మహానంది క్షేత్రంలో ఆర్జేసీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాలను తనిఖీ చేశారు. దర్శనం కోసం వచ్చే భక్తులకు క్షేత్రంలో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. క్షేత్రంలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు ఆస్కారం ఇవ్వరాదన్నారు. ప్రసాదాల కౌంటర్‌ను తనిఖీ చేసి లడ్డూ, పులిహోర నాణ్యతగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నాగమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కేర్ కోర్సులకు దరఖాస్తులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సెక్రటరీ ఏపీ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ సర్వీసెస్ డిప్లమో కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కేఎంసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి సుధీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను సెప్టెంబరు 8వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కర్నూలు మెడికల్ కాలేజీలో రూ.100 రుసుం చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పోస్టు ద్వారా వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవన్నారు. దరఖాస్తులు ఏపీఎస్ఏహెచ్‌పీసీ.సీవో.ఇన్ వెబ్‌సైట్‌లో లభిస్తాయనీ, సెప్టెంబరు 19వ తేదీ కాలేజీలో కోర్సులకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఇంటర్ లేదా తత్సమాన విద్యార్హత కలిగిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని ఇంటర్‌లో బైపీసీ చదివిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు.

కూలిన మట్టి మిద్దెలు

కౌతాళం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలతో పాటు ఇళ్లు కూడా దెబ్బతినడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రమైన కౌతాళంలోని ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి కాలనీకి చెందిన కుమార్, అంజిలకు చెందిన మట్టి ఇళ్లు అధిక తేమతో కూలిపోయాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



కూలిన మట్టి మిద్దెను చూపుతున్న బాధితులు

ముడుమలగుర్తిలో కూలిన ఇళ్లు

కోడుమూరు రూరల్: మండలంలోని ముడుమలగుర్తిలో రెండు ఇళ్లు కూలాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక ఎస్సీ కాలనీలో మాధవస్వామి తండ్రి కాటెన్నతో కలిసి ఉదయం భోజనం చేసి ఇంటి బయట ఉన్నారు. భార్యాపిల్లలు బంధువుల ఊరికి వెళ్లడంతో తండ్రీకొడుకు ఇద్దరే ఉన్నారు. వర్షాలకు ఇంటి పైకప్పు ఒక్కసారి కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అలాగే బీసీ కాలనీలో కురువ చిన్నరామదాసు భార్యాపిల్లలతో నిద్రిస్తుండగా తమ ఇంట్లో అర్ధరాత్రి మట్టిరాలడం గమనించి బయటకు పరుగులు తీశారు. కొద్దిసేపటికే గోడ కూలింది. దీంతో చిన్నరామదాసు కుటుంబం ప్రమాదం నుంచి బయటపడింది. ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితులు కోరారు.



బాధితుడు మాధవ స్వామి ఇల్లు

పిచ్చి కుక్క స్వైరవిహారం..

- ఆరుగురికి గాయాలు

గడివేముల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచాలకట్ట గ్రామంలో మంగళవారం పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. వీధుల వెంట తిరుగుతూ నడుచుకుంటూ వెళ్తున్న చిన్నారులపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ దాడిలో వెంకటరాఘవేంద్ర, రష్మిక, మరో నలుగురు గాయాలపాలయ్యారు. వీరు గడివేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. గ్రామంలో కుక్కల బెడదను నియంత్రించాలని ప్రజలు అధికారులను కోరారు.

అదుపు తప్పిన ఆటో.. ఒకరి మృతి

ఆలూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లుకు ఉల్లిగడ్డల లోడుతో వెళ్తున్న ఆటో బోల్తాపడి ఒకరు మృతిచెందారు. వివరాల మేరకు.. మంగళవారం ఆటో త్రిబెళగల్ సమీపంలో అదుపు తప్పి అందులో ప్రయాణిస్తున్న చిప్పగిరి మంలం నగరడోణ గ్రామానికి చెందిన విరుపాక్షి(38) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సుంకమ్మ ఇప్పటికే మృతిచెందింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు ఆలూరు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్‌కు గాయాలు కాలేదని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహబూబ్ బాషా తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

మంత్రాలయం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవేంద్రపురం గ్రామానికి చెందిన ముల్ల అబ్దుల్ బాషా (53) అనే వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపిన వివరాల మేరకు... ముల్ల అబ్దుల్ బాషాకు మతిస్థిమితం లేదు. సోమవారం రాత్రి కల్లుదేవకుంట-చిలకలడోన రోడ్డుపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రాలయం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతుడికి భార్య మహబూబ్‌బీ, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడు ముల్లజాఫర్ వలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దొంగలకు దేహశుద్ధి

- పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు

కోడుమూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పొట్టేళ్ల దొంగతనానికి వచ్చిన దొంగలను గ్రామస్థులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి మండలంలోని అల్లినగరం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామంలో రహదారి పక్కన నివాసం ఉంటున్న మేకల పెద్దఎర్రమల అనే వ్యక్తి మూడు పొట్టేళ్లను పెంచుతున్నాడు. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు భోజనం చేసి నిద్రపోయారు. అర్ధరాత్రి తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి ఎదుట కట్టి ఉంచిన పొట్టేళ్లలో ఒకదాన్ని వెంట తెచ్చిన ఆటోలో ఎక్కించారు. మరో రెండింటిని ఎక్కిస్తున్న క్రమంలో ఇంటి సమీపంలో ఓ వ్యక్తి గమనించి కేకలు వేశాడు. దీంతో దొంగలు మిగతా పొట్టేళ్లను అక్కడే వదిలేసి ఆటోలో అనుగొండ వైపు పారిపోయారు. దుండగులను గుర్తించిన ఆవ్యక్తి బాధితులను నిద్రలేపి బైక్‌లపై వెంబడించారు. అప్పటికే సమాచారం అందుకున్న అనుగొండ వాసులు ఆటోను పట్టుకున్నారు. బాధితులు వెళ్లి ఆటోతో పాటు దొంగలను అదుపులోకి తీసుకుని గ్రామానికి తీసుకువచ్చారు. తాళ్లతో బంధించి దేహశుద్ధి చేశారు. మంగళవారం ఉదయం పోలీసులకు అప్పజెప్పారు.



పట్టుబడిన దొంగలు

పింఛన్ తొలగించారని దివ్యాంగుడి ఆత్మహత్యాయత్నం

చాగలమర్రి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పింఛన్ తొలగించారంటూ ఓ దివ్యాంగుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చాగలమర్రిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని కేరళ వైద్యశాల సమీపంలో దివ్యాంగుడైన గులంబాషా నివాసం ఉంటున్నాడు. నాలుగేళ్ల క్రితం పక్షవాతం రావడంతో దివ్యాంగుల పింఛన్ మంజూరైంది. ప్రతి నెల రూ.6వేలు తీసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల జరిగిన పింఛన్‌ల విచారణలో తక్కువ శాతం ఉండటంతో అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో మానసిక క్షోభకు గురైన గులాంబాషా పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నంద్యాల వైద్యశాలకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ కేరళ వైద్యశాలకు వెళ్లి అతడిని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ సదరం క్యాంపులో వికలత్వ శాతం 40 ఉండటంతో పింఛన్ తొలగించామన్నారు. దివ్యాంగ పింఛన్‌దారులకు తిరిగి పింఛన్ ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించిందని ఎంపీడీవో పేర్కొన్నారు.



గులాం బాషాను పరామర్శిస్తున్న ఎంపీడీవో రాజేంద్రప్రసాద్

డీఎస్సీ నియామకాలపై కసరత్తు

- ఖాళీల వివరాలు పంపాలన్న ఉన్నతాధికారులు
- పోస్టుల భర్తీతో బదిలీ అయిన రిలీవ్ కాని వారికి ఊరట
- కటాఫ్ మార్కులపై అభ్యర్థుల్లో టెన్షన్
- మిగిలిన ఖాళీల్లో విద్యా వలంటీర్లకు ఛాన్స్?



ఆలూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్ ద్వారా నియామకాలను పూర్తి చేసేందుకు విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ యాజమాన్యాల్లో మొత్తం 2645 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయనుంది. డీఎస్సీలో అభ్యర్థులు సాధించిన మార్కులను విడుదల చేసిన విద్యాశాఖ తదుపరి మెరిట్ జాబితా, రిజర్వేషన్ కం రోస్టర్ మార్గదర్శకాల మేరకు సెలక్షన్ జాబితా, అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, పోస్టింగ్‌కు కౌన్సెలింగ్ ద్వారా నియామకాల ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంది. ఈనేపథ్యంలోనే నియామకాల ప్రక్రియలో భాగంగా జిల్లాల వారీగా వివరాలను పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. డీఎస్సీ-2025లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో నోటిఫై చేసిన మొత్తం పోస్టుల సంఖ్యను మేనేజ్‌మెంట్, కేటగిరీ, మీడియం, సబ్జెక్టుల వారీగా పంపాలని సూచించారు. ఈనెల 31వ తేదీ నాటికి ఏర్పడే ఖాళీల సంఖ్యను ఇదే ఫార్మెట్‌లో అందజేయాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్‌లు కేటాయించేందుకు పాఠశాలల వారీగా ఖాళీల వివరాలు, అసలు టీచరే లేకుండా కేటగిరీ-3/4లో ఉన్న స్కూళ్ల వివరాలు, ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో నూతన స్థానాలకు బదిలీ అయిన రిలీవర్ లేక పాత స్కూల్‌లోనే కొనసాగుతుంటే ఆ స్కూలు వివరాలు, 50 శాతం మందికి పైబడి టీచర్లు కూడా లేని పాఠశాలలు, కేటగిరీ- 3/4ల్లోని స్కూళ్లలో ఇంకా ఎన్ని వెకెన్సీలు భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. తదితర వివరాలన్నింటినీ సేకరించడానికి ఉమ్మడి జిల్లాస్థాయిలో ఈనెల 18న బృందాలను ని యమించారు. నిర్దీత ఫార్మెట్‌లో క్షేత్రస్థాయి నుంచి డేటాను తీసుకోవాలని ఆదేశించారు. తాజా పరిణామాల నేపథ్యంలో మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్ ఈ మండలాల్లోని టీచర్ పోస్టులన్నీ భర్తీ కావడంతో పాటు బదిలీ ఖరారైనప్పటికీ రిలీవర్ లేక ఇప్పటికీ పాత స్థానాల్లోనే కొనసాగుతున్న ఉపాధ్యాయులకు ఊరట లభించడం ఖాయమని చెప్పవచ్చు.

ర్యాంక్ కార్డు మార్కుల ఆధారంగా..

ర్యాంక్ కార్డులో వచ్చిన మార్కుల ఆధారంగా ఉపాధ్యాయ ఉద్యోగం వస్తుందా రాదా ప్రభుత్వం మెరిట్, రోస్టర్ ఆధారంగా ఎన్ని మార్కులకు కటాఫ్ రావొచ్చు అనే ఆందోళనలో అభ్యర్థులు తలమునకలవుతున్నారు. మరోవైపు సోషల్ మీడియాలో కటాఫ్ మార్కులపై వస్తున్న పోస్టింగ్‌లతో కొందరిలో ఆశలు... మరికొందరిలో నిరాశ వ్యక్తమవుతున్నాయి. రేపటిలోగా మెరిట్ లిస్ట్ కూడా విడుదల చేసే అవకాశం ఉంది. ఈనెల 21న ఎంపికైన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించేం దుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లాల నుంచి కౌన్సెలింగ్ కోసం హెచ్‌ఎంలు, కంప్యూటర్ ఆపరేటర్లను డిప్యుటేషన్ వేస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు.

ఖాళీలను గుర్తిస్తున్నాం



ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు, ఏ స్కూల్‌లో ఏ సబ్జెక్ట్ పోస్టు ఖాళీగా ఉంది. బదిలీల తర్వాత ఏర్పడే ఖాళీలు, ఇప్పటివరకు పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల ఖాళీలు, తదితర వివరాలను పంపాలని విద్యాశాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. రోస్టర్, మెరిట్, కటాఫ్ మార్కులు క్యాటగిరీల వారీగా ప్రభుత్వం నిర్ణయించనుంది. డీఎస్సీలో ప్రకటించిన పోస్టులు భర్తీ చేశాక మిగిలిన ఖాళీలను విద్యా వలంటీర్ల ద్వారా భర్తీ చేస్తాం.

● **శామ్యూల్‌పాల్, డీఈవో, కర్నూలు**

అతి వేగానికి నిండు ప్రాణం బలి

- అంబులెన్స్‌ను ఢీకొట్టిన లారీ
- డ్రైవర్ దుర్మరణం
- నుజ్జునుజ్జు అయిన వాహనం
- పరారైన లారీ డ్రైవర్





విచారణ చేస్తున్న పోలీసులు, మృతుడు షేక్ హుసేన్(ఫైల్)

గోనెగండ్ల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అతి వేగానికి ఓ నిండు ప్రాణం బలి అయ్యింది. అంబులెన్స్‌ను లారీ ఢీకొన్న ఘటనలో అంబులెన్స్ డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈఘటన గోనెగండ్ల గ్రామ శివారులో మంగళవారం ఉదయం చోటుచేసుకున్నట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలు.. ఎమ్మిగనూరు చెందిన షేక్ హుసేన్(31) 11 ఏళ్లుగా డ్రైవర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య హుసీనా, తల్లిదండ్రులు ఉన్నారు. కొన్ని నెలలు క్రితం స్వంతంగా అంబులెన్స్‌ను కొని దానికి తానే డ్రైవర్‌గా ఉన్నాడు. ఎమ్మిగనూరులోని ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి రోగులను రోజు కర్నూలు అసుపత్రికి తరలించే వాడు. మంగళవారం తెల్లవారుజామున మెడికవర్ ఆసుపత్రి నుంచి రోగిని కర్నూలు ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. అక్కడ రోగిని చేర్చి తిరిగి ఎమ్మిగనూరుకు బయలు దేరాడు. ఉదయం 7గంటల సమయంలో గోనెగండ్ల దగ్గర ఉన్న భారత్ గ్యాస్ గోడౌన్ దగ్గరకు రాగానే ఎదురుగా మహారాష్ట్ర నుంచి ఉల్లిగడ్డల లోడ్‌తో కర్నూలుకు వెళ్తున్న లారీ(ఎంహెచ్ డీక్యూ 9693) ఎదురుగా వస్తున్న అంబులెన్స్‌ను అతివేగంగా వచ్చి ఢీకొన్నది. ఈ సంఘటనలో అంబులెన్స్ నుజ్జునుజ్జు అయింది. దీంతో అంబులెన్స్ డ్రైవర్ షేక్ హుసేన్‌కు తీవ్రగాయాలయ్యాయి. లారీ డ్రైవర్ అక్కడ నుంచి పారిపోయాడు. పరిసర ప్రాంతాల వారు గాయాల పాలైన హుసేన్‌ను ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్ పరారీ ఉండటంతో లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్.. దుకాణం దగ్ధం

ఆలూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్ బజారులో ఉన్న తేజ టైలర్ షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కుట్టుమిషన్లు, దుస్తులు దగ్ధమయ్యాయి. బాధితుడు రామకృష్ణ కథనం మేరకు.. మంగళవారం ఉదయం షాప తెరచి చూడగా మంటలు ఉండటంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. తనకు రూ.3 లక్షలకు పైగా ఆస్తినష్టం వచ్చిందని బాధితుడు రామకృష్ణ తెలిపాడు. ఆర్ఐ బసవన్నగౌడ్ పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు.



దుకాణాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ బసవన్నగౌడ్

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం..!

- వెళ్తున్నప్పుడే ఊడిన బస్సు చక్రం
- డ్రైవర్ చాకచక్యంతో ప్రయాణికులు సురక్షితం



ఊడి పడిన బస్సు టైరు

ఆత్మకూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్టీసీ డిపోకు చెందిన ఓ అద్దె బస్సుకు పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. ఆత్మకూరు డిపోకు చెందిన పల్లెవెలుగు అద్దెబస్సు కర్నూలు నుంచి ఆత్మకూరుకు వస్తోంది. ఈ క్రమంలోనే పట్టణంలోని కేజీ రోడ్డు మీదుగా వెళ్తుండగా ఇందిరానగర్ వద్ద బస్సు ముందు భాగంలోని కుడి వైపు గల టైర్ ఒక్కసారిగా ఊడిపడి ఇరుసు రోడ్డును రాసుకుంటూ కొంతదూరం వెళ్లింది. అయితే డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బ్రేక్ వేయడంతో బస్సులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదమూ జగరలేదు. ఈ విషయమై ఆత్మకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వినయ్‌కుమార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా బస్సు చక్రం ఊడిన ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు. ప్రమాదానికి గురైన అద్దెబస్సు సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు చెప్పారు. బస్సు కండిషన్ పూర్తిస్థాయిలో సక్రమంగా ఉంటేనే పునరుద్ధరిస్తామన్నారు. అదేవిధంగా అన్ని అద్దెబస్సుల యజమానులకు కూడా తగిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామని వివరించారు.

వాహనం బోల్తా.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ఆత్మకూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంజీవనగర్ తండా సమీపంలో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై సోమ వారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బల్గర్ వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి... గడివేముల మండలంలోని జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి సుమారు 30 టన్నుల సిమెంట్‌ను ఆత్మకూరు మీదుగా విజయవాడకు బల్గర్ వాహనం ద్వారా తరలిస్తున్నారు. సంజీవ నగర్ తండా సమీపంలో వాహనం కేజీ రోడ్డుపై వెళ్తుండగా రోడ్డు పక్కన ఉన్న మట్టి వర్షాల వల్ల కుంగిపోవడంతో వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వాహన యజమాని మంగళవారం సంఘటనా స్థలానికి మరో బల్గర్ వాహనాన్ని తెప్పించి బోల్తా పడిన వాహనం నుంచి సిమెంట్‌ను మరో వాహనంలోకి లోడ్ చేయించే చర్యలు చేపట్టారు.



సంజీవనగర్ తండా పక్కన బోల్తా పడిన వాహనం

బుక్‌కీపర్ చేతివాటం

- రూ. పది లక్షలు స్వాహా
- ఆందోళనలో పొదుపు మహిళలు




కోవెలకుంట్లలోని వెలుగు కార్యాలయం



కోవెలకుంట్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన వెలుగు బుక్‌కీపర్ పొదుపు మహిళల రుణాల రికవరీ సొమ్మును బ్యాంకుకు చెల్లించకుండా చేతివాటం ప్రదర్శించాడు. ఏకంగా పదిలక్షల స్వాహాచేసి గ్రామం నుంచి ఉడాయించాడు. తెలుసుకున్న వెలుగు అధికారులు బుక్‌కీపరుపై నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పొదుపు మహిళలు ఆందోళన చెందుతున్నారు. పొదుపు మహిళల నుంచి స్త్రీనిధికి సంబంధించి రుణాలను బుక్‌కీపరు నెలనెలా వసూలు చేశారు. బ్యాంకుకు చెల్లించకుండా చేతివాటం ప్రదర్శించి సుమారు 10లక్షల రూపాయలు బక్కేశారని పొదుపు మహిళలు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఉడాయించిన బుక్‌కీపర్ నుంచి డబ్బులు వసూలు చేయించి బ్యాంకుకు కట్టించి తమకు న్యాయం చేస్తారని పొదుపు మహిళలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈవిషయంపై వెలుగు సీసీ ఏపీఎం శేఖర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, బుక్ కీపరు చేతివాటం ప్రదర్శించి డబ్బులు నొక్కేసిన మాట వాస్తవమేనని తెలిపారు. అయితే ఇది రెండేళ్లక్రితం జరిగిందన్నారు. అప్పట్లో తాను ఇక్కడ లేనని చెప్పారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు తెలిపి అతడిపై చర్యలు తీసుకుంటా మని ఆయన సమాధానమిచ్చారు.

అనధికార లే అవుట్లలో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దు

● కుడా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న కుడా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అనధికారిక లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దని కుడా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో జిల్లా పంచాయతీరాజ్ అధికారులతో మంగళవారం పలు పథకాలపై ఉద్యోగులకు నిర్వహించిన అవగాహనా సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం అనధికారిక లే అవుట్‌లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని పొడిగిస్తూ సవరణ ఉత్తర్వులు తీసుకువచ్చిందన్నారు. 31-12-2020 నాటికి దరఖాస్తు చేసుకోలేని ప్లాట్ యజమానులకు ప్రయోజనం కల్పించేలా 30-06-2025 కంటే ముందు వేసిన అనధికారిక లే అవుట్‌లలో రిజిష్టర్ అయిన అనధికారిక ప్లాట్లను ప్రణాళికాబద్ధంగా తీసుకు రావడానికి ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని కొనసాగిస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీల్లోని అనధికారిక లే అవుట్‌లను ఎల్‌ఆర్‌ఎస్ స్కీము ద్వారా దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ప్లానింగ్ అధికారులు మోహన్‌కుమార్, విజయభాస్కర్, సహాయ ప్లానింగ్ అధికారి శశికళ పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

● డాక్టర్ అన్వర్ హుస్సేన్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అన్వర్ హుస్సేన్

నందికొట్కూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ అనర్వర్ హుస్సేన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని గాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ఆధ్వర్యంలో హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ అంటే ఏమిటి.. ఎలా వ్యాపిస్తుంది.. ఏ విధంగా ఉంటే వ్యాపించదు, ఒక వేళ వస్తే ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలి.. తదితర విషయాలను ఆయన వివరించారు. అలాగే డ్రగ్స్, నైతిక విలువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సంతోషమ్మ, హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ నరసింహుడు పాల్గొన్నారు.

స్ఫూర్తి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 30న నిర్వహించే స్ఫూర్తి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం అని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బోయ బాలకృష్ణ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పర్యవేక్షణలో సంచార, అర్థ సంచార, విముక్తి జాతుల స్ఫూర్తి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సంచార జాతుల కోసం బీజేపీ 'స్ఫూర్తి' కార్యక్రమాన్ని ఈనెల 30న విజయవాడలో నిర్వహించనుందన్నారు. ఆధునిక సమాజానికి గతాన్ని గుర్తుచేస్తూ భారతీయ మూలాలు, సంచార సమాజం త్యాగాలను స్మరిస్తూ చేపట్టే కార్యక్రమమే స్ఫూర్తి అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పిలుపుతో రాష్ట్రంలో సంచార కులాల పెద్దలను బీజేపీ ఆహ్వానిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీడీఎన్‌టీ సెల్ కన్వీనర్ నాగరాజు, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు అశ్విన్ కుమార్, పాలసీ రీసెర్చ్ జిల్లా కన్వీనర్ శ్రీధర్ బాబు, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్జీఎంలో ఎలక్ట్రికల్ వెహికల్స్ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కళాశాల చైర్మన్ శాంతిరాముడు

పాణ్యం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ఫ్యూచర్ మొబిలిటీ ఎలక్ట్రికల్ వెహికల్స్ ల్యాబ్‌ను కళాశాల చైర్మన్ శాంతిరాముడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రంగంలో నైపుణ్యం సాధించడం ద్వారా విద్యార్థులు ప్రపంచ స్థాయి అవకాశాలు పొందవచ్చన్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అవకాశాలు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు మరిన్ని అవకాశాలు పొందవచ్చని బెంగుళూరు యూఐపాత్ కేంద్ర ఆసియన్ పసిఫిక్ జపాన్ రీజియన్ అకడమిక్ అలయన్స్ హెడ్ అభిజిత్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆర్జీఎం కళాశాలలో సీఎస్‌ఈ (డేటాసైన్స్) విభాగం ఆధ్వర్యంలో యూఐపాత్ స్టూడెంట్స్ డెవలపర్ కమ్యూనిటీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రోగ నిర్ధారణలో కృత్రిమ మేధ ప్రాధాన్యం

రోగ నిర్ధారణలో కృత్రిమ మేధ ప్రాధాన్యాన్ని సంతరించుకుందని ఆంధ్రప్రదేశ్ హ్యాకర్స్ అండ్ సైబర్ కాప్స్ ట్రైనింగ్ అడ్మినిస్ట్రేటర్ సాయి సతీష్ అన్నారు. ఆర్జీఎం ఈసీఈ ఆధ్వర్యంలో వైద్య రంగంలో కృత్రిమ మేధ వినియోగాలు అనే అంశంపై అవగాహన కల్పించారు.

లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్‌గా శ్రీకాంత్

నంద్యాల కల్చరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్‌గా పెసల శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ నంద్యాల సేవ ప్రగతి లయన్స్‌క్లబ్‌లో చేసిన సేవలకు గుర్తింపుగా నాలుగు రెవెన్యూ జిల్లాలు అనంతపురం, కర్నూలు, కడప, నెల్లూరులకు సంబంధించి లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్‌గా తనను నియమించినట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం కడప కసాపురం వాసవీ కళ్యాణ మండపంలో ప్రమాణ స్వీకారం చేసినట్లు తెలిపారు.

అంగన్‌వాడీల్లో ఇష్టారాజ్యం

● సమయపాలన గాలికి
● హాజరు నమోదు లేదు
● అధికారులు స్పందించాలి

చిన్నారుల్లో ఆడుకునే వయస్సు నుంచే అక్షరజ్ఞానం అలవర్చాలన్న సదుద్దేశంతో ప్రభుత్వ ఏర్పాటు చేసిన అంగన్‌వాడీల్లో లక్ష్యం నీరుగారుతోంది. కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాలు సమయపాలన పాటించడం లేదు. హాజరు గాలికొదిలేశారు. మంగళవారం నంద్యాల మండలం పాండురంగాపురం, బాపూజీనగర్ గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆంధ్రజ్యోతి విజిట్ చేయగా వెలుగు చూసిన వివరాలు ఇవీ...



మంగళవారం మధ్యాహ్నం 1 గంటకే మూసిఉన్న కేంద్రం



మళ్లీ తెరిచిన తర్వాత పిల్లలు లేకుండా ఇలా..

నంద్యాల రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల్లో కార్యకర్తలు, ఆయాలు ఏ మాత్రం సమయపాలన పాటించడం లేదు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు నిర్వహించాల్సి ఉండగా కొన్ని కేంద్రాలు మధ్యాహ్నం 1 గంటకే మూసి ఉంటున్నాయి. మరికొన్ని కేంద్రాల్లో వారాల తరబడి హాజరు వేయడం లేదు. సరుకుల పంపిణీ సరిగా ఉండటం లేదు. నంద్యాల మండలం పాండురంగాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా.. మధ్యాహ్నం 1 గంటకే మూసి ఉంది. విషయాన్ని సూపర్‌వైజర్ దృష్టికి తీసుకెళ్లగా ఆమె ఆ కార్యకర్తకు ఫోన్ చేయడంతో మళ్లీ వచ్చి కేంద్రం తెరిచారు. విద్యార్థులెవరూ లేకపోవడంతో ఎందుకు కేంద్రం మూసి ఉందని ప్రశ్నించగా భోజనానికి వెళ్లామంటూ అంగన్‌వాడీ సిబ్బంది డొంక తిరుగుడు సమాధానం చెప్పారు. కేంద్రం ఆ సమయానికే మూసి ఉందంటే పిల్లలకు భోజనాలు వడ్డించారా.. లేదా, లేకపోతే అసలు తెరిచారా లేదా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. అనంతరం పాండురంగాపురం మజరా గ్రామమైన బాపూజీనగర్‌లోని కేంద్రాన్ని పరిశీలించగా.. పిల్లలకు గత వారం రోజుల నుంచి హాజరు వేయలేదు. ఎందుకని ప్రశ్నించగా సరైన సమాధానం రాలేదు. అన్ని రోజుల నుంచి కార్యకర్త రాలేదా లేక కేంద్రం తెరవలేదా.. అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సిబ్బంది తీరుపై స్థానికులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనం

పాండురంగాపురంలో కేంద్రం మూసివేతకు ఎలాంటి అనుమతివ్వలేదు. విచారించి చర్యలు తీసుకుంటాం. హాజరు నమోదుపై నోటీసు జారీ చేసి చర్యలు తీసుకుంటాం. హాజరు వేయకపోవడానికి కారణం సిబ్బంది నిర్లక్ష్యమే. ● కుమారి, సూపర్‌వైజర్

ఉన్నతాధికారుల తీరుపై విమర్శలు

నంద్యాల మండలం చాబోలు గ్రామంలోని అంగన్‌వాడీల్లో సమయపాలన పాటించడంలేదని ఆగస్టు 12న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకొని ఉంటే మళ్లీ ఈ సమస్య వచ్చేది కాదేమోనని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

ప్రతి ఫొటో వెనుక ఓ జ్ఞాపకం దాగి ఉంటుంది

● ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



లూయిస్ జాక్వియస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆత్మకూరు ఫొటో గ్రాఫర్లు

ఆత్మకూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఫొటో వెనుక ఓ జ్ఞాపకం దాగి ఉంటుందని పలువురు ఫొటోగ్రాఫర్లు పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలో మంగళవారం అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఫొటో, వీడియో గ్రాఫర్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మార్కెట్ యార్డులో ఫొటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ జాక్వియస్ చిత్రపటానికి ఆత్మకూరు ఫొటో అసోసియేషన్ ప్రతినిధులు మౌలాలి, శివగౌడు, రంగస్వామి, చంద్రశేఖర్, అశ్వక్‌అలి, ధర్మారెడ్డి, మధు, నారాయణ, షబ్బీర్, కృష్ణయ్య, నజీర్, నూర్ అమ్మద్, ఇస్మాయిల్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఫొటో వెనుక ఒక జ్ఞాపకం, ఓ కథ, ఓ అనుభూతి దాగి ఉంటుందన్నారు. ఇంతటి తీయని గుర్తుల ముద్రలు వేసే ఫొటోగ్రఫీ కోసం ప్రపంచవ్యాప్తంగా ఓ రోజును ప్రకటించడం హర్షణీయమన్నారు. వృత్తిపరంగా తమకు ఒకరోజు ఉండడం తమ వృత్తికి, నిర్వహిస్తున్న తమకు ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. కాగా ఫొటోగ్రఫీపై ఆధారపడి లక్షల మంది జీవనం సాగిస్తున్నారని, అలాంటి వారికి ప్రభుత్వం అండగా నిలవాలని విన్నవించారు.

వెలుగోడు: పట్టణంలో ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఫొటోగ్రఫీ పితామహుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు రామలింగం, రసూల్, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమకు ప్రభుత్వం ఇంటి స్థలాలు, ఋణాలు అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారయణ, మల్లికార్జున, రహిమాన్, వెంకటయ్య, చాంద్ తదితరులు పాల్గొన్నారు.



వెలుగోడులో..

యూరియా సకాలంలో అందించాలి



మిడుతూరులో రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

మిడుతూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా రైతులకు సకాలంలో అందించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మిడుతూరు బస్టాండు ఆవరణంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న, పత్తి, కంది, మిరప, పొగాకు పంటలు విస్తారంగా సాగు చేస్తున్నారన్నారు. గత 20 రోజులుగా రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాల్లో ఒక్క బస్తా యూరియా కూడా అందడంలేదని ఆవేద వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మహాసభ నాయకులు నాగరాజు, నాయుడు, సోమప్ప, స్వాములు, శ్రీరాములు, పార్టీ నాయకులు నరసిహులు, స్వామన్న, శ్రీనివాసులు,బీబీ పాల్గొన్నారు.

61మంది దివ్యాంగుల పింఛన్ల తొలగింపు

కొత్తపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 61 మంది దివ్యాంగుల పింఛన్లును జిల్లా వైద్యాధికారులు తొలగించినట్లు మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీవో ఆలాంబాషా తెలిపారు. మండలంలో మొత్తం 441 దివ్యాంగుల పింఛన్లు ఉండగా.. ఇందులో 61 మందికి 40 శాతం తక్కువగా పర్సంటేజీ ఉండటంతో వైద్యాధికారులు తొలగించారన్నారు.వీరు మళ్లీ స్థానిక సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్లకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ దరఖాస్తులను సదరం క్యాంపులకు పంపిస్తామని తెలిపారు. సదరం క్యాంపు వైద్యాధికారులు ప్రకటించిన తేదీన నంద్యాల సదరం క్యాంప్‌నకు వెళ్లి మళ్లీ వైద్యపరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. అప్పుడు 40 శాతం పైగా పర్సంటేజీ ఉంటే పింఛన్ పొందేందుకు అవకాశ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు వికలాంగులు ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పింఛన్ల కోసం దరఖాస్తులు

పాములపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల పెన్షన్లు రద్దు లేదా పింఛన్ల మార్పుల నోటీసులు పొందిన దివ్యాంగులు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసే పింఛనర్లు వ్యక్తిగతంగా అర్జీ రాసి, ఆధార్ జిరాక్స్, పెన్షన్ రద్దు నోటీసు, పాత సదరం సర్టిఫికెట్, పెన్షన్ దారుడు ఏదైనా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంటే అందుకు సంబంధించిన పత్రాలు జతపరచి ఇవ్వాలన్నారు. ఎంపీడీవో లాగిన్ నుంచి నోటీసులు అందిస్తామని, పెన్షన్‌దారులు మరోసారి వైద్య పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

ఇనుప కడ్డీలు చోరీ

నంద్యాల రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణానికి నిల్వ ఉంచిన ఇనుపకడ్డీలు మాయమైన ఘటన నంద్యాల మండల పరిధిలోని చాబోలు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామంలోని సాంబవరం వెళ్లే రహదారి వద్ద అంగన్‌వాడీ భవన నిర్మాణం చేపట్టారు. బేస్‌మెంట్ వరకు పనులు పూర్తయ్యాయి. బిల్లులు రాకపోవడంతో గతేడాది నుంచి నిర్మాణ పనులు నిలిపివేశారు. దీంతో మిగిలిన ఇనుప కడ్డీలను సమీపంలోని ఓ ఇంటి వద్ద ఉంచారు. అయితే కొద్ది రోజుల కిందట అదే గ్రామానికి చెందిన కొందరు ఈ కడ్డీలను తీసుకెళ్లినట్లు సమాచారం. నిల్వ ఉంచిన సిమెంట్ కూడా గడ్డ కట్టింది. ఈ విషయంపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కుమారి మాట్లాడుతూ ఇనుప కడ్డీలు చోరీకి గురైన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. సంబంధిత కార్యకర్తకు పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.



ఆగిన అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులు

రైతులకు వెంటనే పరిహారం అందించాలి

● రైతు సంఘం, సీఐటీయూ నేతల డిమాండ్



కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న రైతు సంఘాల నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో వన్యప్రాణుల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక అటవీశాఖ కార్యాలయం ఎదుట వారు ధర్నా చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు, వెలుగోడు మండలాల్లోని అనేక గ్రామాల్లో సాగు చేసిన మొక్కజొన్న, మినుము, వేరుశనగ, కంది, వరి, సోయాబీన్, జొన్న పంటలను అడవి పందులు నాశనం చేస్తున్నాయన్నారు. రైతులు వాటిని అరికట్టే చర్యలకు రైతులు అటవీ అధికారులు కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఇప్పటికే పంట దిగుబడులకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడిపోతున్నారని, ఈ పరిస్థితుల్లో వన్యప్రాణుల వల్ల పంటలు నష్టపోవడం రైతులకు శాపంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అడవి జంతువుల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేల పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పంట పొలాల్లోకి వన్యప్రాణులు రాకుండా అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అటవీ రేంజ్ అధికారి కృష్ణప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఆయా ఆ సంఘాల నాయకులు సుబ్బరాయుడు, గంగన్న, రణధీర్, రామ్‌నాయక్, వెంకటరెడ్డి, రామకృష్ణ, హుసేనయ్య లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతతతోనే విజయం సాధ్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడే విజయం సాధ్యమవుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ శశికళ అన్నారు. మానసిక ఒత్తిడి- మానసిక ఆరోగ్యంపై మంగళవారం కళాశాలలో విద్యార్థులకు నిపుణుల చేత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జీవితంలో కోరుకున్న లక్ష్యాలను చేరుకోలేక అనే మంది మానసిక ఒత్తిడిలకు గురవుతున్నారని, తద్వారా ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ సమస్యకు అయినా పరిష్కారం తప్పక ఉంటుందని, తోటివారితో పంచుకోవడం వల్ల కొంత ఉపశమనం లభిస్తుందన్నారు. అనంతరం మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ శరత్‌చంద్ర విద్యార్థులకు మానసిక ఒత్తిళ్లను ఏ విధంగా ఎదుర్కోవాలో వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొటాష్‌ను బూస్టర్ డోసుగా వాడుకోవాలి

పాములపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : అధిక వర్షాలతో వరిపంట నీటి ముంపునకు గురైతే పొలంలో నుంచి నీటిని కాల్వల ద్వారా బయటకి పంపి ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరెట్ పొటాష్‌ను బూస్టర్ డోసుగా వేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి మహేశ్వరరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వరిలో కాండం పురుగు ఆశించడం వల్ల మొక్కలోని పువ్వు చనిపోతుందని, క్లోరిపైరిపాస్ ఒక్క లీటరు నీటికి 2.5 ఎంఎల్ కలపి పిచికారీ చేయలని పేర్కొన్నారు. అలాగే పంట సాగులో చీడపీడల నివారణకు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఆయన సూచించారు.

కానిస్టేబుల్‌కు సన్మానం



కానిస్టేబుల్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఎస్ఐ, సిబ్బంది

మహానంది, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మహానంది పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ చంద్రశేఖర్‌ను మంగళవారం సాయంత్రం ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వ ర్యంలో సిబ్బంది సన్మానించారు. గత నాలుగు రోజుల క్రితం మహానంది క్షేత్రానికి వచ్చిన కర్ణాటక రాష్ట్రం బీజాపూర్‌కు చెందిన భక్తులు చిన్నారి కారులో ఉంచి కారుకు తాళం వేయడంతో ఆ చిన్నారి ఊపిరి ఆడక కొట్టుమిట్టాడుతున్న విషయం తెలుసుకొన్న కానిస్టేబుల్ చంద్రశేఖర్ కారు అద్దాలు పగలగొట్టి చిన్నారిని కాపాడిన విషయం విదితమే. దీంతో మంగళవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ, సిబ్బంది చంద్రశేఖర్‌ను సన్మానించి అభినందించారు.

జంప్‌రోప్ పోటీల్లో శాంతినికేతన్‌కు పతకాలు

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):నంద్యాల పట్టణంలోని క్రాంతినగర్‌లో ఉన్న శాంతినికేతన్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులకు రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీల్లో 11 పతకాలు లభించినట్లు ఆ పాఠశాల అధినేత సుధాకర్ తెలిపారు. ఈ నెల 16, 17 తేదీల్లో నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు లోకేష్, గురుతరుణ్, అఖిలేష్ కుమార్, వలి ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించారన్నారు. అలాగే ఓబులేసు, సుకుమార్, యశ్వంత్ నాయక్ వెండిపతకాలు సాధించారన్నారు. గురుతరుణ్, లోకేష్ నాయక్, విష్ణువర్ధన్‌లు కాంస్యపతకాలు సాధించారన్నారు. వీరు సెప్టెంబర్‌లో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో జరిగే జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులకు మంగళవారం అభినందనసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జాని, శ్రీలేఖ, మధు, సతీష్‌లను చైర్మన్ సుధాకర్ అభినందించారు.

ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన చెంచు మహిళలు



ఆత్మకూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి ఆత్మకూరు మండలం బైర్లూటి గిరిజన గూడేనికి చెందిన చెంచు మహిళలు రాఖీ కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మంగళవారం ఉదయం వారు వేల్పనూరులోని ఎమ్మెల్యే స్వగృహానికి చేరుకుని ఎమ్మెల్యేకు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా చెంచు సోదరీమణులను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తమపై చూపే ప్రేమను మరువలేమన్నారు. గూడేల అభివృద్ధికి, చెంచుల సంక్షేమానికి ఎమ్మెల్యే కృషి ఎనలేనిదని వారు కొనియాడారు.

వివాహిత అదృశ్యం

మహానంది, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం అబ్బీపురం గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యం అయినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. ఈనెల 18వ తేదీన గ్రామంలోని కిరాణం దుకాణానికి ఇంటి సరుకులు కొనుగోలు చేసేందుకు వెళ్లిన తన కోడలు తిరిగి రాలేదని ఆమె మామ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



గోపవరంలో ప్రధాన రహదారిపై కూలిన భారీ వృక్షం

కూలిన భారీ వృక్షం

మహానంది, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు మహానంది మండలం గోపవరం ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలిపోయింది. దీంతో రాకపోకలు స్తంభించాయి. విద్యుత్ స్తంభాలు కూడా నేలకూలడంతో సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు గ్రామంలోని కొన్ని కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మంగళవారం ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతో సిబ్బంది కూలిన వృక్షాన్ని, విద్యుత్ స్తంభాలను తొలగించి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

తగ్గని వరద ఉధృతి

● స్తంభించిన రాకపోకలు

చాగలమర్రి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం అల్పపీడనంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, వక్కిలేరు, కుందూ వరద నీటి ఉధృతి తగ్గలేదు. మంగళవారం తెల్లవారుజామున కురిసిన కుండపోత వర్షంతో బ్రాహ్మణ ఎల్లె, కలుగొట్లపల్లె వక్కిలేరు వంతెనలపై వరద నీరు పొంగి ప్రవహించింది. గోపాయపల్లె రహదారిలో అడ్డవాగు పొంగి ప్రవహించి రాకపోకలకు రైతులు ఇబ్బంది పడ్డారు.

రుద్రవరం : మండలంలో వరుసగా నాలుగురోజుల నుంచి వర్షం కురుస్తోంది. వాన వదలకపోవడంతో రైతులు ఆందోళన పడుతున్నారు. మొక్కజొన్న, మిరప, ఆయిల్‌పాం తోటలు , వరి పొలాల్లో వర్షం నీరు నిలిచింది. పంటలు దెబ్బతింటున్నాయని రైతులు మదన పడుతున్నారు.

కూలిన సైడ్‌వాల్‌కు మరమ్మతులు

● తెలుగుగంగ ఇన్‌చార్జి ఎస్‌ఈ ప్రతాప్



తూమును పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎస్‌ఈ ప్రతాప్

రుద్రవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం సమీపంలోని తెలుగుగంగ ప్రధాన కాల్వలో భాగంగా 21 వ తూము వద్ద కూలిన తెలుగు గంగ మెయిన్ కెనాల్ రక్షణ గోడ (సైడ్‌వాల్)ను తెలుగుగంగ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజనీరు ప్రతాప్ పరిశీలించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'కూలిన సైడ్‌వాల్' అనే కథనం ప్రచురితమైంది. దాంతో ఆయన కెనాల్ రక్షణ గోడను పరిశీలించారు. సైడ్‌వాల్‌కు తాత్కాలికంగా ఇసుక సంచులతో మరమ్మతులు చేయిస్తామన్నారు. శాశ్వత పరిష్కారానికి నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గంగ ప్రధాన కాల్వలకు ప్రమాదం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన అన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. తుండ్లవాగు రిజర్వాయరు నీటి సామర్థ్యాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఈఈ జవహర్‌రెడ్డి, డీఈలు అనిల్‌కుమార్‌రెడ్డి, గురుమూర్తి, జేఈలు వినయ్, మోహన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండుపాపల సొసైటీ చైర్మన్‌గా విశ్వనాథ్‌రెడ్డి

దొర్నిపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండుపాపల సహకార సంఘ సొసైటీ చైర్మన్‌గా గోపవరం విశ్వనాథ్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సబ్‌డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో సొసైటీ చైర్మన్‌గా విశ్వనాథ్‌రెడ్డి, డైరెక్టర్లుగా రూపనగుడి సుబ్బారెడ్డి, గట్టిపాటి రాజశేఖర్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో వెంకటసుబ్బయ్య, సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

బాలిక అదృశ్యం : కేసు నమోదు

సంజామల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన పదవ తరగతి చదువుతున్న బాలిక అదృశ్యమైనట్లు ఎస్‌ఐ రమణయ్య మంగళవారం తెలిపారు. ఈ నెల 18న వర్షం పడుతుండటంతో పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉన్నది. అయితే మధ్యాహ్నం 3గంటల నుంచి కనపడకపోవడంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడిపై అనుమానం ఉన్నట్లు బాలిక తల్లి ఫిర్యాదులో పేర్కొనడంతో ఆ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

శక్తి యాప్‌పై అవగాహన పెంచుకోవాలి

కోవెలకుంట్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మహిళ శక్తి యాప్‌పై అవగాహన పెంచుకోవాలని మహిళా పోలీసుస్టేషన్ సీఐ గౌతమి అన్నారు. మంగళవారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం శేఖర్ ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

బేతంచెర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాలను సాంప్రదాయబద్ధంగా ప్రశాంతంగా జరుపుకోవాలని గణేష్ కేంద్ర కమిటీ సభ్యులు గౌరీ హుసేన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ హరిప్రసాద్ అధ్యక్షతన ఉత్సవ కమిటీల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ చలంరెడ్డి మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల్లో డీజేలు లేకుండా జరుపుకోవాలన్నారు. సమావేశంలో సీఐ వెంకటేశ్వరరావు, జనసేనా నాయకులు శ్రీకంటి మధు, తహసీల్దార్ నాగమణి, ఎస్‌ఐ రమేష్‌బాబు, ఏడీ మధుసూదన్ రెడ్డి, గణేష్ కేంద్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

బేతంచెర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జంగాలపేటలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీ మహిళలు అధికారులకు మొర పెట్టుకున్నారు. మంగళవారం నగర పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చి చైర్మన్ చలంరెడ్డి, తహసీల్దార్ నాగమణి, కమిషనర్ హరిప్రసాద్‌ను కలిశారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

రమణీయం.. దేవదేవుడి గ్రామోత్సవం

● శ్రీకృష్ణుడి పల్లకీ సేవలో తరించిన భక్తజనం

● ఆకట్టుకున్న గీతా బోధనలు, సాంస్కృతిక కార్యక్రమాలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : భక్తి పారవశ్యమైన డప్పు వాయిద్యాలు .. కళాకారుల నృత్య ప్రదర్శనలు.. ఆధ్యాత్మిక వక్తల భగవద్గీత ప్రవచనాలు.. మార్మోగుతున్న శ్రీకృష్ణ పరమాత్ముడి జేజేలు.. వీటన్నిటి మధ్య ప్రత్యేకంగా అలంకరించిన పూల పల్లకీలో దేవదేవుడైన శ్రీకృష్ణ పరమాత్ముడి గ్రామోత్సవం కొలిమిగుండ్ల మండలం మీర్జాపురం గ్రామంలో అత్యంత రమణీయంగా సాగింది. గ్రామంలోని వాల్మీకి ఆలయం ముందు మూడు రోజులుగా ప్రత్యేక మండపంలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఏర్పాటుచేసి పూజలు నిర్వహించారు. మంగళవారం శ్రీకృష్ణుడి పల్లకీ ఉత్సవాన్ని ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక ప్రతినిధులు మహమ్మద్ హుస్సేన్ నాయుడు, పోరెడ్డి రామకృష్ణారెడ్డి, బాలు, భూపాల్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు పల్లకి ఉత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు బాల హుస్సేన్‌నాయుడు, నత్తి రామ చంద్రుడు, శ్రీరాములు, రామ్మూర్తి, వేణుయాదవ్, రామచంద్రారెడ్డి, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.


రామిరెడ్డిపల్లెలో శ్రీకృష్ణుడి ఊరేగింపు

సంజామల: మండల వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు మంగళవారం ముగిశాయి. మండలంలోని రామిరెడ్డిపల్లెలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా స్వామివారి విగ్రహాన్ని కొలువుదీర్చారు. ప్రతి రోజూ పూజలు చేసి మంగళవారం వేణుగోపాలుడి ప్రతిమను గ్రామోత్సవం నిర్వహించారు. కోలాటాలు, చెక్క భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి రామిరెడ్డిపల్లె కమిటీ అధ్యక్షుడు రాజశేఖర్, వెంకట సుబ్బయ్య, గురుప్రసాద్, సులోచన, గురు నాగేంద్ర, రమణ, గణపతి, పురుషోత్తం పాల్గొన్నారు.

డోన్ టౌన్: జన్మాష్టమి వేడుకల సందర్భంగా మంగళవారం పట్టణంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన


గ్రామోత్సవంలో పాల్గొన్న సీఐ రమేష్, ప్రబోధ సేవా సమితి సభ్యులు

వేదిక డోన్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ఉత్సవ ప్రతిమను పల్లకిలో ఏర్పాటుచేసి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో డోన్ కమిటీ అధ్యక్షుడు నాగార్జున, నాగేంద్ర, సర్వేశ్వరయ్య, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, గిరి, సుంకన్న, రామాంజి, జానీ, షేక్షావలి, శేషు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.


డోన్‌లో స్వామివారి పల్లకోత్సవం

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

బనగానపల్లె, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అండర్ డ్రైనేజీ, పలు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. పాతబస్టాండ్ సమీపంలో రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభాల వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, స్తంభాలను పక్కకు తరలించాలని విద్యుత్ శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. అలాగే షాదీఖానా భవన నిర్మాణ పనులను పరిశీలించారు. సాధ్యమైనంత మేరకు పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు నారాయణరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు, ఏఈ రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, షేక్షా, అబ్దుల్ రహీం పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

మంత్రిని కలిసిన నూతన ఎస్‌ఐ

బనగానపల్లె నూతన ఎస్‌ఐగా కల్పన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని మంత్రి సూచించారు.

సొసైటీ అభివృద్ధికి కృషి చేయండి

సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సూచించారు. మంగళవారం భానుముక్కల సొసైటీ చైర్మన్‌గా నియమితులైన అత్తార్ కలాం క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. తనను సొసైటీ చైర్మన్‌గా నియమించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే కోవెలకుంట్ల మండలం పెద్దకొప్పెర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన గడ్డం వెంకటేశ్వరరెడ్డి మంగళవారం క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలో రైతు ప్రభుత్వం

● అన్నదాత కళ్లలో ఆనందం చూడాలన్నదే చంద్రబాబు ధ్యేయం

● ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి ● చెరువులకు జలహారతి


మల్లెంపల్లె చెరువుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ద్వారా చెరువులకు నీటితో నింపి రైతు కళ్లలో ఆనందాన్ని నింపిన అపర భగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జగదుర్తి, ఉడుములపాడు, మల్లెంపల్లె, బొంతిరాళ్ల, వెంకటాపురం, అబిరెడ్డిపల్లె, దేవరబండ, కొచ్చెర్వు చెరువులను ఇరిగేషన్ డీఈ చంద్రశేఖర్, ఏఈ హరికిషన్‌తో కలిసి పరిశీలించారు. చెరువులకు ఎమ్మెల్యే కోట్ల జలహారతి ఇచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు బాగా పడటంతో చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయన్నారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని, దళారీల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్కసాగరం లక్ష్మిరెడ్డి, రేగటి అర్జున్ రెడ్డి, నాయకులు విజయభట్టు, రేగటి అర్జున్‌రెడ్డి, శేషఫణి గౌడు, శ్రీనివాసులు యాదవ్, శ్రీరాములు, ప్రతాప్ రెడ్డి, కృష్ణారెడ్డి, గంగాధర్ రెడ్డి, రామాంజనేయులు, రాధమ్మ, కార్యకర్తలు ఉన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ


ప్రింటర్‌ను ఇస్తున్న పీఆర్టీయూ నాయకులు

చాగలమర్రి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రింటర్‌ను పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్రారెడ్డి అందజేశారు. మంగళవారం పాఠశాలలో హెచ్‌ఎం మహబూబ్‌బాషకు ప్రింటర్‌ను అందజేశారు. పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉపయోగార్థం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రింటర్‌ను అందజేసిన పీఆర్టీయూ నాయకులను అభినందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మౌలాలి, జిల్లా కౌన్సిలర్లు హరిహరనాథ్‌రెడ్డి, సురేష్‌బాబు, షరీఫ్, ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, కవిత పాల్గొన్నారు.

23న జాబ్‌మేళా

ఆళ్లగడ్డ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేవీ సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాలలో ఈనెల 23న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 6305399744, 9701303790లకు సంప్రదించాలన్నారు.

గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోండి

ఆళ్లగడ్డ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత ఉండి లబ్ధిపొందని రైతులు రైతు సేవా కేంద్రాలలో గ్రీవెన్స్ మాడ్యూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏవో రాజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అర్జీలను పరిశీలించి అర్హులకు ప్రభుత్వం నిధులు జమ చేస్తుందన్నారు.

రోగులకు లయన్స్ క్లబ్ సభ్యుల అన్నదానం

బేతంచెర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శేషారెడ్డి సామాజిక ఆరోగ్య కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు, మహిళలకు రోగులకు ప్రభుత్వ వైద్యులు సాగరిక, హరిప్రియ అన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పట్టణానికి చెందిన కోట్ల జీవరత్నమ్మ సహకారం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సురా మధు సుధాకర్ రెడ్డి, కోట్ల రమేష్‌బాబు, వన్నూరు సాహేబ్, రామకృష్ణ, కేశాల్ నాయుడు, మధు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అర్హుల పింఛన్ తొలగించొద్దు


కొలిమిగుండ్లలో ఎంపీడీవోకు వినతి పత్రాన్ని ఇస్తున్న దివ్యాంగులు

కొలిమిగుండ్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : అన్నివిధాలా అర్హత కలిగిన దివ్యాంగుల పింఛన్ తొలగించరాదని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక సంఘం నాయకుడు మద్దిలేటిరెడ్డి కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రసాదరెడ్డికి వినతిపత్రం అందజేశారు. తొలగించిన అర్హులకు పింఛన్ పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దివ్యాంగుల రీవెరిఫికేషన్ సర్టిఫికెట్‌లో కేటగిరీలు తప్పుగా నమోదయ్యాయని, సరి చేయాలని కోరారు. కార్యక్రమంలో రామచంద్రుడు, నారాయణస్వామి, శివకుమార్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న 30 మంది అనర్హుల పింఛన్లు తొలగించినట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయా గ్రామాల్లోని అనర్హులకు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 శాతం కన్నా తక్కువ దివ్యాంగత్వము ఉన్న వారి పింఛన్లు తొలగించామన్నారు. వీరు అంత కన్నా ఎక్కువ శాతం దివ్యాంగత్వం కలిగి ఉంటే తమ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు.

ఆళ్లగడ్డ: అనర్హుల పింఛన్ తొలగించడంపై లబ్ధిదారులు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. వికలత్వం వందశాతం ఉన్న తమ పేర్లు ఎందుకు తొలగింపు జాబితాలో చేర్చారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పునరుద్ధరించి పింఛన్లు ఇవ్వాలని కోరారు. త

స్వచ్ఛదివస్ అందరి బాధ్యత


మాట్లాడుతున్న డీఎల్‌డీవో శివారెడ్డి

చాగలమర్రి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం అందరి బాధ్యతని డీఎల్‌డీవో శివారెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయా శాఖల అధికారులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పీ-4, స్కిల్ సర్వేలను వేగవంతం చేయాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడాలని అన్నారు. జిల్లాలో ఐదు వేల దివ్యాంగుల పింఛన్‌లు తొలగించారన్నారు. తిరిగి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిదన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకంలో అర్హత ఉండి రాని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, ఏఈ కొండారెడ్డి, మహిళా పోలీసులు ఉన్నారు.

జ్వర పీడిత బాధితుల గుర్తింపు సర్వే

చాగలమర్రి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండటంతో ముందస్తుగా వార్డుల్లో జ్వర పీడిత బాధితులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తెలిపారు. మంగళవారం చాగలమర్రి 1వ వార్డులో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వర బాధితులను గుర్తించి మందులను పంపిణీ చేశారు. బీపీ, షుగర్, పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ తేజస్విని, ఏఎన్‌ఎం ఉమా, ఆశావర్కర్ శివలక్ష్మీ ఉన్నారు.

క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

చాగలమర్రి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని సెయింట్‌ఆన్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు లగోరి పోటీల్లో చాంపియన్‌షిప్ సాధించారని పీడీ వెంకటేష్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో మైదుకూరు మేధా డిఫెన్స్ అకాడమి ఆధ్వర్యంలో ఈనెల 17న లగోరి క్రీడ పోటీలు ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులు ప్రతిభ కనబరిచి సిల్వర్ పతాకాన్ని, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. విద్యార్థులను ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, హెచ్‌ఎం స్మిత, ఉపాధ్యాయులు అభినందించారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు

చాగలమర్రి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): టీజీపీ ఆయకట్టు పరిధిలోని రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని టీజీపీ డీఈ వెంకటరమణ తెలిపారు. మంగళవారం టీజీపీ ప్రధాన కాలువ నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కాలువలో 3,500 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందన్నారు.

వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్‌పై దాడి

బనగానపల్లె, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశయ్యతోట సమీపంలో వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ చంద్రమౌళీ ఆచారిపై టీడీపీ కార్యకర్తలు దాడులు చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. చంద్రమౌళీఆచారి కొంతకాలంగా తెలుగుదేశం పార్టీ పై అసభ్యకర పోస్టులు పెడుతుండటంతో ఈ దాడి జరిగినట్లు సీఐ తెలిపారు. పలువురిపై కేసు నమోదు చేశామన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



ఫొటోగ్రాఫర్ ముక్తర్‌ను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

డోన్ రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పొదుపు గ్రూపు భవనంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. డోన్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముక్తార్‌ను రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు జింకలకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి

డోన్ రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీపై అవగాహన ఉండాలని సబ్‌జైలు సూపరింటెండెంట్ సురేష్ అన్నారు. మంగళవారం హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సబ్‌జైల్‌లో రిమాండ్ నిందితులకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. నిందితులకు హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హ్యాండ్స్ సిబ్బంది మధు కుమార్, సోఫియా, రాజేశ్వరి ఉన్నారు.

నిండు కుండలా చెరువులు


నీటితో కళకళలాడుతున్న రంగారెడ్డి చెరువు

రుద్రవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో చిన్ననీటిపారుదలశాఖ పరిధిలో ఉన్న 16 చెరువులు నిండుకుండలా జలకళ సంతరించుకుంది. రుద్రవరం సమీపంలోని రంగారెడ్డి, పెద్దరాజ, కొండమాయపల్లె చిన్నరాజ, బి.నాగిరెడ్డిపల్లె సోమయాజులపల్లె చెరువు, చందలూరు రాళ్లవాగు చెరువు, లింగందిన్నె, చింతలచెరువు ఆలమూరు చీలబోయిన చెరువు, తదితర చెరువులకు ఇటు వర్షం నీరు, అటు కాల్వ నీరు చేరాయి. ఎప్పటికప్పుడు చెరువులను పర్యవేక్షిస్తున్నామని ఎంఐ ఏఈ రఘురాముడు తెలిపారు. చెరువులవద్దకు వెళ్లినప్పుడు రైతులు, స్థానికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నీటి కుంటలా ఆర్టీసీ బస్టాండు


ఆర్టీసీ బస్టాండులో నీటి కుంటలు

చాగలమర్రి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఆర్టీసీ బస్టాండు నీటి కుంటను తలపిస్తోంది. బస్టాండు ఆవరణలో నీరు నిలిచి కుంటలాగా మారింది. ఆ నీటిలో నుంచే బస్సులు రాకపోకలు చేయాల్సి ఉంది. భారీ కుంటలు ఉండటంతో ప్రయాణికులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగక ముందే మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.